## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ హైమావతి

**నంగునూర్, నవంబరు 20, ప్రభాతవార్త:** విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. మండల పరిధిలోని నర్మెట గ్రామంలోని కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం, పప్పు, కాకరకాయ, సాంబారు, గుడ్డు వండినట్లు వంట సిబ్బంది తెలపగా ఆహార పదార్థాలు తనిఖీ చేసి నాణ్యత మెరుగు పరచాలని వంటసిబ్బందిని ఆదేశించారు. ఎదిగే పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ప్రతి రోజు విద్యార్థులకు నెయ్యి పెట్టాలని స్వయంగా నెయ్యి వడ్డించారు. విద్యాలయంలో 260 మందికి గానూ 230 విద్యార్థులు హాజరు ప్రకారం వంట సరుకులు అందించినట్లు ఎస్ఓ కలెక్టర్‌కు తెలిపారు. కామన్ డైట్ మెనూ పాటించాలని కూరగాయలు దొరకడం లేదని సాకులు చెప్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్‌లె తనిఖీ చేస్తూ రిజిస్టర్ రాయడంలో జాప్యం చేయవద్దని ప్రిన్సిపల్ నుంచి వంట సిబ్బంది వరకు మీ యొక్క విధులు సక్రమంగా నిర్వహించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తరుచే హెల్త్ చెకప్ చేయాలని హిమోగ్లోబిన్ శాతం తగ్గిన వారికి కొత్త డైట్ లేదా దగ్గరలోని ప్రాంతీయ ఆసుపత్రికి పంపించాలని ఎఎన్ఎంను ఆదేశించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## గోమాత ఆకారంలో దీపాలు వెలిగించిన భక్తులు

**వర్గల్, నవంబరు 20 (ప్రభాతవార్త):** కార్తీక మాసం చివరిరోజు కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా గురువారం నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు తెలిపారు. మన సంస్కృతిరంగా గావో విశ్వస్య మాతరః అని అంటారు కాబట్టి ఆలయ ప్రాంగణంలోని గోశాల వద్ద గోవు ఆకారంలో ఏర్పాటుచేసిన దీప ప్రమిదలను భక్తులు వెలిగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



గోమాత ఆకారంలో దీపాలు



కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

## కేంద్ర మంత్రిని కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రామచంద్రాపురం, నవంబరు 20, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో గురువారం ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలుసుకుని శాలువాతో సన్మానించి పూల బొకేను అందజేశారు. రాష్ట్రంలో సివిల్ సప్లై వ్యవస్థపై, పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలపై కేంద్ర మంత్రికి ఎమ్మెల్సీ వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బిజెపి శాసన సభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బిజెపి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్‌లు ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాలను శిశు సంక్షేమ శాఖ

## అధికారి తనిఖీ..పలువురికి మెమోలు జారీ

**పుల్కల్, నవంబరు 20,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొంగ్లూరు, గొంగ్లూరుతండా, ఇసోజిపేట, కోమార, మన్నూర్ గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాలను గురువారం జిల్లా మహిళా శిశు వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమశాఖ అధికారి లలితకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలక్ష్యం వహించిన అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు లలితకుమారి మెమోలు జారీ చేశారు. గొంగ్లూర్ తండాలో కార్యకర్త భారతమ్మ పిల్లలకు ఆటలు, పాటలు నేర్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆయా బుధవారం విధులకు గైర్హాజరు అయ్యారని, గురువారం సెలవుపై వెళ్లినట్లు అధికారి లలితకుమారి గుర్తించారు. మిన్పూర్‌లో అంగన్‌వాడి కేంద్రం-3 కార్యకర్త లక్ష్మీ విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తోందంటూ అధికారి ముగ్గురికి వేరు వేరుగా మెమోలను జారీ చేశారు. ఆయా కేంద్రాల్లో అధికారి మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. సరుకులు ఎప్పటికప్పుడు నిల్వ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం కేంద్రాల్లోనే ఉంచాలని, బయటకు తీసుకురావద్దన్నారు. కేంద్రాల నిర్వాహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారి లలితకుమారి హెచ్చరించారు.

## 1న వందేమాతరం సామూహిక గీతాలాపన

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులు

**పటాన్‌చెరు, నవంబరు 20, ప్రభాతవార్త :** డిసెంబర్ 1వ తేదీన పటాన్‌చెరులో నిర్వహించ తలపెట్టిన వందేమాతరం 150 వసంతాల సామూహిక గీతాలాపన కార్యక్రమ ఏర్పాట్లను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి పటాన్‌చెరులోని నోవపాన్ పరిశ్రమ సమీపంలో గల ఖాళీ స్థలంలో కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. 30 వేల మంది విద్యార్థులు ఒకే సమయాన సామూహిక గీతాలాపన చేసేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్‌రెడ్డి, జాతీయ రహదారుల సంస్థ డీఈ రాఘవేంద్ర, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యా శాఖ అధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కాళీమాత ఆలయంలో హోమం

**వెల్దుర్తి, నవంబరు 20, ప్రభాతవార్త :** మండలంలోని మన్నె వారి జలాల్పూరం వద్ద వెలసిన కాళికామాత ఆలయంలో భక్తులు గురువారం నాడు కార్తీక మాసం అమావాస్య కావడంతో కాళీమాతకి విశేష పూజలు నిర్వహించారు. హోమం,అభిషేకాలను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళికామాత అనుగ్రహం కోసం పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం

**చిన్నకోడూరు, నవంబరు 20, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో కార్తీక మాసంలో భాగంగా గురువారం వీరభద్రస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి మంగళహారతులు, భక్తిశ్రద్ధలతో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాస దీపోత్సవ కార్యక్రమం ప్రతి యేటా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని మహిళ భక్తులు తెలిపారు. గుడిలో ఓం అకృతిలో దీపాలు వెలిగించారు. స్వామి వారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం గుడి ఆవరణలోని ఉసిరి చెట్టు కింద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పానుగంటి శారద, ప్రేమలత, స్వప్న,జయ, లక్ష్మీ, వైష్ణవి, దీప, మౌనిక,రజిత, మాధవి, కనకతార, భక్తులు, పాల్గొన్నారు.

## డిసిసిబి సేవలను వినియోగించుకోవాలి

**పెద్దశంకరంపేట, నవంబరు 20, ప్రభాతవార్త :** డీసీసీబి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డీసీసీబి మేనేజర్ ఖలీమొద్దిన్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించారు. స్వర్ణనిధి డిపాజిట్ పథకం ద్వారా 444 రోజులకు అధిక వడ్డీ అందిస్తున్నామని, వ్యవసాయ, వ్యాపార, వాణిజ్య రుణాలు, గోల్డ్ రుణాలు. విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు అందిస్తున్నామన్నారు. క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈఓ రవీందర్, ఫీల్డ్ ఆఫీసర్ భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

# 'రేషన్' గోదాముల్లో గోల్‌మాల్

* ఎలక్ట్రానిక్ కాంటాలు పెట్టినా ప్రయోజనం శూన్యం * ప్రతీ డీలర్‌కు క్వింటాలుకు మించి తరుగు
* ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా మారని తీరు * డీలర్లనుంచి కొట్టేసిన బియ్యం దారిమళ్లింపు?



అందోలు ఎంఎల్ఎస్‌పాయింట్లో నిల్వఉన్న బియ్యం

**జోగిపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** ప్రజా పంపిణీ వ్యవస్థలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నప్పటికీ ఇక్కడ రేషన్ డీలర్లకు మాత్రం తిప్పలు తప్పటం లేదు. అవినీతికి మారుపేరుగా ఉండే ప్రజాపంపిణీ వ్యవస్థను సివిల్ సప్లై కమిషనర్‌గా సి.వి.ఆనంద్ బాధ్యతలు చేపట్టిన అనంతరం సమూల మార్పులుచేసి ఏమాత్రం అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో తెలంగాణ ప్రజాపంపిణీ వ్యవస్థ ఇప్పుడు దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. ఇదంతా ఒక ఎత్తయితే మొత్తం వ్యవస్థలో ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పోయినప్పటికీ ఒక విషయంలో మాత్రం నేటికీ మార్పు రావటం లేదు. అదే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్‌షాపులకు బియ్యం పంపిణీలో మాత్రం తీవ్రమైన అవినీతి చోటుచేసుంటుంది. ఈ విషయంలో డీలర్లు కిందిస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఫిర్యాదులు చేసినా డీలర్లకు వంద శాతం వెయింగ్ మాత్రం రావటంలేదన్నది వాస్తవం. దీంతో ప్రతినెల డీలర్లకు షార్టేజీ అవుతుంది. ఈ పరిస్థితిలో మార్పు ఎప్పుడు వస్తుందా అని డీలర్లు వేచిచూస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలులో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచే జిల్లాలోని 846 రేషన్ షాపులకు బియ్యం తరలిస్తారు. రేషన్ డీలర్లకు బియ్యం వేసేముందు గోదాం ఇన్‌ఛార్జ్ సదరు డీలర్‌కు ముందస్తు సమాచారం ఇచ్చి, గోదాంకు వచ్చాక, అతని ముందు ఎలక్ట్రానిక్ కాంటామీద బియ్యం బస్తాలువేసి తూకం వేసి, ఒక కేజీ కూడా తక్కువ రాకుండా బియ్యాన్ని డీలర్‌కు పంపాలి. కానీ గోదాముల్లో అలా జరగటం లేదు. తూకం వేసుకుని తీసుకొని వెళ్లేందుకు ఎవరైనా డీలర్ గోదాంకు వస్తే, గోదాం ఇంఛార్జ్ ఏదో ఒక కారణం చెప్పి ఎవరైతే నేరుగా లారీలో బియ్యం నింపి పంపిస్తే దించుకునే డీలర్లు ఉన్నారో వారికి బియ్యం పంపుతారు. ఆయినే సహనం పాటించి మరో రోజు వచ్చి తూకం వేశాకే బియ్యం వేయాలని పట్టుబడితే హమాలీలు సమస్య సృష్టిస్తారు. ఈ పరిస్థితుల్లో గోదాముల్లోని ఎలక్ట్రానిక్ కాంటాలపై ఇరవై క్వింటాళ్ల బియ్యం వేసి, ఎంతమంది డీలర్లకు బియ్యం వేయాలన్నా వాటిని కాంటామీద అలాగే ఉంచి డీలర్‌కు ఉన్న అలాట్‌మెంట్‌నుబట్టి అవసరమున్నన్నిసార్లు డీలర్లతో గోదాం ఈపాస్ మిషన్‌లో వేలిముద్ర తీసుకుని వేయింగ్ చేస్తారు. అనంతరం స్టేజీ వన్ లారీలో బియ్యాన్ని స్టేజీ టు లారీలోకి క్రాసింగ్‌చేసి, క్వింటాలుకు రెండు సంచుల మేర బియ్యాన్ని గోదాముల నుంచి రేషన్ షాపులకు పంపుతున్నారు. ఎవరైనా రేషన్ డీలర్ మొండికేసి గొడవకు దిగితేతప్ప. లేదా సదరు డీలర్‌తో ఇబ్బందులు ఎదరవుతాయనుకుంటే వారికి మాత్రం ఒకటి లేదా రెండు బస్తాల బియ్యం ఎక్కువగా వేసి గోదాముల్లో ఏ గొడవా లేకుండా చూసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో రేషన్ డీలర్లు నష్టపోవాల్సి వస్తుంది.

### లబ్దిదారులకు మాత్రం పక్కాగా వేయింగ్

రేషన్ డీలర్లకు నూతనంగా ఇచ్చిన వేయింగ్ మిషన్లు, ఇపాస్ మిషన్ల ద్వారా ప్రస్తుతం బియ్యం పంపిణీ చేస్తున్న సందర్భంలో బియ్యం తూకంలో ఇరవై గ్రాముల తేడా ఉన్నా ఆ ట్రాన్సాక్షన్ పూర్తవదు. లబ్దిదారుడికి ఎన్ని కేజీల బియ్యం వస్తాయో అన్ని కేజీల బియ్యం కరెక్టుగా తూకం వేస్తే తప్ప ఈ పాస్ మిషన్‌లో ఆ రేషన్‌కార్డు ట్రాన్సాక్షన్ పూర్తవదు. ఇంత పకడ్బందీగా రేషన్ డీలర్ బియ్యం పంపిణీ చేయాల్సి వస్తున్న సందర్భంలో ప్రతి నెలా రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు బియ్యం తక్కువవుతున్నాయి. వీటిని సర్దుబాటు చేయలేక డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపునకు పంపే బియ్యంలో కనీసం గన్నీ బ్యాగ్ బరువుకూడా తీయకుండా క్వింటాలుకు రెండు సంచుల లెక్కన పంపుతూ గోదాం ఇంఛార్జులు అడ్డగోలుగా దోచుకుంటున్నారు. తమకు బియ్యం తక్కువ వస్తున్నాయని గోదాం ఇన్‌ఛార్జులను ప్రశ్నిస్తే సంచి యావరేజ్ యాభై నుంచి యాభై ఒక్క కిలోల వరకు ఉందని దబాయిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు రాకపోగా, పైనుంచి అది మీ డీలర్లదే తప్పని అనటం విడ్డూరం. ఎందుకంటే ఎట్టిపరిస్థితుల్లో పక్కాగా వందశాతం గోదాంలో వేయింగ్ చేసుకున్నాకే బియ్యం తీసుకెళ్లాలని చెబుతున్నారు. కేవలం డీలర్లు తమకు రావాల్సిన బియ్యంకోసం వేలిముద్రలు ఇవ్వడానికి మాత్రమే గోదాములకు వెళ్లాల్సి వస్తుంది.

### గోదాముల నుంచి దారిమళ్లుతున్న బియ్యం?

జిల్లాలోని అన్ని మండల్ లెవల్ స్టాక్ పాయింట్లలో రేషన్‌డీలర్లకు తూకం వేయకుండానే బియ్యం పంపుతున్న విషయం కిందిస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకూ తెలిసిందే. అయితే ఇక్కడ రేషన్ డీలర్లకు రావాల్సిన పరిమాణంలో ఎంతో కొంత మొత్తంలో గోదాం ఇన్‌ఛార్జ్‌లకే మిగిలిపోతున్నాయి. ఇలా ప్రతినెలా ఒక్కో ఎంఎల్ఎస్ పాయింట్‌లోఉన్న రేషన్‌డీలర్ల సంఖ్యను బట్టి, వారికి ఉన్న బియ్యం పరిమాణాన్నిబట్టి ఒకరి దగ్గర ఎక్కువ, మరొకరి దగ్గర తక్కువమొత్తంలో గోదాములో మిగిలిపోతాయి. ఈ విధంగా డీలర్లకు తక్కువచేసి కొట్టేసిన బియ్యం ఎక్కడకు దారిమళ్లుతున్నాయనేది ప్రశ్నార్థకం. కేవలం రేషన్ షాపులకే కాకుండా హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు పంపే బియ్యంలోనూ గోదాం ఇంచార్జ్‌లు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇలా ప్రతినెలా పెద్దమొత్తంలో గోదాం ఇన్‌ఛార్జ్‌లు అన్నీ లెక్కలు సక్రమంగానే చూపినప్పటికీ రేషన్ డీలర్లు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల బియ్యంలో నుంచి నొక్కేసిన బియ్యాన్ని దారిమళ్లించి సొమ్ముచేసుకుంటున్నారనే ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి రేషన్ షాపులకు బియ్యం కేజీ తక్కువకాకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలని రేషన్‌డీలర్లు డిమాండ్ చేస్తున్నారు.

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట

## పెట్రోలు పోసుకొని రైతు ఆత్మహత్యా యత్నం

**చౌటకూరు, నవంబరు 20 ప్రభాతవార్త :** ఆరు దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు అమలు చేయటంలేదని ఆరోపిస్తూ రైతు ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన చౌటకూరు తహసీల్దారు కార్యా లయంలో గురువారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. చౌటకూరు గ్రామానికి చెందిన దూడ సిద్దయ్య సర్వే నెంబరు 1527, 1591లోని 37గుంటల భూమిలో 1962- 63 నుంచి సాగు చేస్తున్నాడు. పట్టాదారు కాలంలో మాత్రం పర్వతగారి లింగారెడ్డి పేరు ఉండగా అను భవదారుడు కాలంలో దూడ సిద్దయ్య పేరు నమో దైంది. సిద్దయ్య మృతి అనంతరం ఆయన కుమా రులు దూడ మాణయ్య, మల్లేశం సాగు చేస్తున్నారు. పర్వత్‌గారి లింగారెడ్డి పేరున భూమి ఉండటంతో ఆయన మరణానంతరం కుటుంబసభ్యుల పేరున పట్టామార్పిడి జరిగింది. 2007లో సింగూరు ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ కాలువ తవ్వకంలో 8గుంటల భూమిని కోల్పోగా దూడ మాణయ్య, మల్లేశంలు సాగు చేస్తున్నారంటూ అప్పట్లో అధికా రులు నష్టపరిహారం చెక్కులు వారికే అందచేశారు. సర్వే నెంబరు 1527, 1591లోని 29గుంటల భూమిలో కబ్జాలో ఉన్నామని, తమపేరున అమలు చేయాలంటూ దూడ మాణయ్య, కుమారుడు మల్లేశం అనేక సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయాడు. ఆత్మహత్యతోనైనా భూమిని అమలు చేస్తారేమోనని గురువారం పెట్రోలు డబ్బా, సూసైడ్ నోట్ రాసుకొని తహశీల్దారు కార్యాలయానికి వచ్చాడు. తహశీల్దారు నామాల కిష్టయ్యకు సూసైడ్‌నోట్‌ను అందచేసి ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అప్రమత్తమైన ఇతర సిబ్బంది దూడ మల్లేశం ఒంటిపై నీళ్లుచల్లి అడ్డుకున్నారు.

ఈ విషయమై రెవెన్యూ అధికారులు పట్టాదారులైన లింగారెడ్డి కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడారు. 20గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయటం లేదని అడగ్గా, ఈ భూమికి బదులుగా వేరేచోట ఇస్తామని చెప్పటంతో దూడ సిద్దయ్య కుటుంబ సభ్యులు ఒప్పుకోవటంలేదని తెలిపారు. నిజానికి ఏండ్లతరబడి వారు కబ్జాలో ఉన్నది వాస్తవమేనని అంగీకరించారు. ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేసిస్తామంటూ లికిఖపూర్వకంగా రాసివ్వటంతో గొడవ సద్దుమణిగింది.

## నాయబ్ తహసీల్దార్‌గా అనుదీప్

**చౌటకూరు, నవంబరు 20, ప్రభాతవార్త:** మండల నాయబ్ తహసీల్దార్‌గా ఎస్ అనుదీప్ నియమితులయ్యారు. ఇంత వరకు నయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వీబీ సదాశివపేట మండలానికి డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనుదీప్ సదాశివపేటలో ఇంత వరకు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించారు.

## చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

**గజ్వేల్ టౌన్, నవంబరు 20 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామానికి చెందిన బీసమైన శ్రీనివాస్ ఇంట్లో ఈనెల 15వ తేదీన చోరీకి పాల్పడిన అదే గ్రామానికి చెందిన బీసమైన పెద్ద నాగులు దొంగతనానికి పాల్పడగా అతన్ని అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ సిఐ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ రవికుమార్ మాట్లాడుతూ బీసమైన శ్రీనివాస్ పనికి వెళ్లిన సమయంలో ఇంటి తాళం పగులగొట్టి 35 తులాల వెండి పట్టగొలుసులు, 1.2 తులాల బంగారం, రూ.10వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ కేసులో సిఐ రవికుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ముత్యం రాజు, ఎస్ఐ మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ఐలు యాదగిరి, ఉమర్, కానిస్టేబుల్స్ నరేంద్ర, సురేందర్, రవి, మహిళా కానిస్టేబుల్ దివ్యలు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టి నిందితున్ని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుని వద్ద నుండి చోరీచేసిన సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు.





వివరాలు తెలుపుతున్న సిఐ రవికుమార్

### జిల్లా కారాగారాన్ని, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

# ప్రారంభానికి సిద్ధం చేయాలి

### పనులను పరిశీలించి అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హైమావతి



నర్మెటలో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/నంగునూర్, నవంబరు 20, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో 34 ఎకరాలలో రూ.78 కోట్లతో నిర్మించిన జిల్లాకారాగారాన్ని త్వరలో సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి సిద్ధం చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. దాదాపు జైలు కారాగారం పనులు పూర్తి చేయడం జరిగిందని సబ్ జైలు ఎస్ఐ వికాస్, ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కారాగారం బయట లోపల ఆమె కలియ తిరిగి ఎవైనా అసంపూర్తి పనులు ఉంటే వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు,

### ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పరిశీలించిన కలెక్టర్

మండల పరిధిలోని నర్మెట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని జిల్లా కలెక్టర్ హైమావతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఫ్యాక్టరీ లోపల బీటీ రోడు నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. రోడ్ వెంబడి చెట్ల పొదలు తొలగించాలన్నారు. విఐపి పార్కింగ్, హెలిప్యాడ్ తయారీ చేయాల్సిందిగా ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. సిఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు కావాల్సిన అనుమతులు తీసుకొని ప్రారంభానికి సంబంధించి పనులను పక్కా ప్రణాళికలతో సిద్ధం చేయాలని ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. అనంతరం నర్మెట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట ఆర్డీఓ సదానందం, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి, అయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడినడ, అయిల్‌ఫెడ్ ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## భూమి గొడవలో వృద్ధుడు మృతి

**వర్గల్, నవంబరు 20 (ప్రభాతవార్త):** ఇల్లు భూమి విషయంలో జరిగిన గొడవలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం నాచారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మరాఠి లక్ష్మయ్య(60)ను పాలివారైన మరాఠి రమేష్ ఇల్లు భూమి విషయంలో గొడవ పడి తలపై కొట్టడంతో తీవ్ర గాయంకావడంతో చికిత్స నిమిత్తం తూప్రాన్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

## రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

### భార్యకు తీవ్ర గాయలు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 20, ప్రభాతవార్త :** నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయలయ్యాయి. చిన్నకోడూరు పోలీసుల కథనం ప్రకారం... రాజన్నసిరిసిల్ల జిల్లా తంగేళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన తిరుపతి(49) భార్య రజిత సిద్దిపేటలో బంధువులు చనిపోవడంతో బైక్‌పై వస్తున్న క్రమంలో హైదరాబాద్ నుంచి సిరిసిల్ల వైపు రాంగ్ రూట్‌లో అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో భర్త తిరుపతి(49) మృతి చెందగా భార్య రజితకు తీవ్ర గాయలయ్యాయని తెలిపారు. రజితను చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## గౌరవెల్లి స్కూల్లో చోరీ

**అక్కన్నపేట, నవంబరు 20, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పాఠశాలలోని విలువైన కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లతోపాటు సీసీ కెమెరాలు ఇతర వస్తువులు దొంగిలించినట్లు ప్రధానోపాధ్యాయులు జ్యోతి తెలియజేశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించామన్నారు. విషయం తెలుసుకున్న అక్కన్నపేట ఎస్ఐ చేతరాజు ప్రశాంతి పాఠశాలకు చేరుకుని క్లూస్ టీంతో కలిసి దర్యప్తు చేస్తున్నారు. అయితే పాఠశాలలో ఇప్పటికే రెండుసార్లు దొంగతనం జరిగిందని, ఇది మూడవసారి అంటూ స్థానికులు చెబుతున్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

**గుమ్మడిదల నవంబరు 20 ప్రభాతవార్త :** ఈ నెల 19వ తేదీన ఎరపుల శ్రీనివాస్ తండ్రి మల్లయ్య(45) మద్యం తాగి వాహనం నడపగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టగా టెస్ట్ నిర్వహించగా గురువారం అతడిని కోర్టులో హాజరుపరచగా న్యాయాధిపతి షకీల్ అహ్మద్ సిద్దిఖీ 3 రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ డ్రింక్ చేసి ఎవరూ డ్రైవింగ్ చేసి, ప్రమాదలకు కారకులు కావద్దని సూచించినారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం కోర్టుకు పంపడం జరుగుతుందని తెలిపారు.

## దాడి కేసులో ఇద్దరికి జరిమాన

**సంగారెడ్డి రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త:** పాతకక్షలను మనుసులో పెట్టుకుని రాయితో దాడి చేసి గాయపర్చిన ఇరువురికి న్యాయమూర్తి జరిమాన విధిస్తూ గురువారం తీర్పుచెప్పినట్లు మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. ఎస్ఐ రాజేష్‌నాయక్ కథనం ప్రకారం... 2019 మార్చి 18న మన్‌సాన్‌పల్లి గ్రామంలో కలాలి మహేష్ గౌడ్, బేగరి నాగరాజు కట్లాడుకుంటుండగా గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టి ఫిరంగుల మోహన్ వెళ్లి పంచాయితీ చెబుతుండగా మోహన్ పాలోళ్లయిన ఫిరంగుల శ్రీనివాస్, ఫిరంగుల నరసయ్యలు పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని గత ఎన్నికల్లో తమకు మద్దతు పలుకలేదని దూషిస్తూ రాయితో దాడి చేసి గాయపర్చారన్నారు. అప్పట్లో బాధితుడు మోహన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు ఫైల్ చేశారన్నారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ లతీఫ్ ఉర్ రహమాన్ వాదించగా మునిపల్లి పోలీసు ఠాణా కోర్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సాక్షులను, పంచులను కోర్టులో హాజరు పర్చగా కేసును సంగారెడ్డిలోని ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి పూర్వాపరాలను పరిశీలించి నేరస్థులైన ఫిరంగుల శ్రీనివాస్‌కు, ఫిరంగుల నరసయ్యలకు చెరో రూ. 5 వేలు జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారన్నారు.

## కారులో నుంచి మంటలు..తప్పిన ప్రమాదం



కారులో నుంచి మంటలు చెలరేగుతున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్(చిన్నకోడూరు), నవంబరు 20, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ శివారులో రాజీవ్ రహదారిపై వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన గురువారం జరిగింది. స్థానికలు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌కు చెందిన జమీల్ అహ్మద్ కుటుంబ సభ్యులతోకలిసి కారులో సిద్దిపేటకు వస్తున్నారు. కారు ఇబ్రహీంనగర్ శివారులోకి రాగానే ఒక్కసారిగా కారులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో వారు అప్రమత్తమై వెంటనే కారులో నుంచి దిగి పరుగులు తీశారు. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక వాహనం మంటలను ఆర్పినప్పటికీ పూర్తిగాకాలిపోయింది.

## అగ్ని ప్రమాదంలో లారీ దగ్ధం

**జహీరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** అగ్నిప్రమాదంలో లారీతో సహ అందులోని బిల్డింగ్ వైరు పూర్తిగా కాలిపోయిన సంఘటన బుధవారం అర్ధరాత్రి కోహీర్ మండలం కవేలి చౌరస్తాలో జరిగింది. కోహీర్ ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం బసవ కళ్యాణ్‌కు చెందిన లారీ (కేఏ 56 6758) బైండిగ్ వైర్ లోడ్‌తో బయలుదేరింది. కవేలి గ్రామ శివారుకు లారీ చేరుకోగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు రేగుతున్న విషయాన్ని గమనించిన డ్రైవర్ అప్రమత్తమై లారీని రోడ్డుపక్కన ఆపుకుని క్లీనర్‌తో కలిసి మంటలను ఆర్పే యత్నం చేసినా మంటలు అదుపులోకి రాక లారీ, బైండింగ్ వైరు కాలిపోయాయన్నారు. డ్రైవర్ ఖాసిపటేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారన్నారు.



దగ్ధం అవుతున్న లారీ


ములుగులోని అటవీ కళాశాల

## అటవీ కళాశాలలో పర్యావరణంపై జాతీయ సదస్సు

**ములుగు, నవంబరు 20 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థ (ఎఫ్‌సిఆర్ఐ)లో పర్యావరణ, వ్యర్థాల నిర్వహణ అనే అంశంపై ఈనెల 21,22 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డీన్, సదస్సు చైర్‌పర్సన్ వి.కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్ఎస్.శ్రీనిధి తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి డాక్టర్ సి.సువర్ణ, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, ఆచార్య కొండ లక్ష్మణ్‌బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ డి.రాజిరెడ్డి, తెలంగాణ అటవీ సంరక్షణ అధికారి డాక్టర్ ప్రియాంకవర్గీస్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ రవి గుగులోత్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ప్రముఖ విశ్వవిద్యాలయాల నుండి ప్రొఫెసర్లు, విద్యార్థులు, పరిశోధకులు, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, కార్యకర్తలు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

## విజ్ఞాన బాండాగారం గ్రంథాలయాలు

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెడం లింగమూర్తి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**


విజేతలకు బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

గ్రంథాలయాలను వినియోగించుకొని విజ్ఞానవంతులు కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెడం లింగమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ దినోత్సవ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విజ్ఞాన బాండాగారం గ్రంథాలయాలు అన్నారు. అత్యాధునికంగా గ్రంథాలయంను అందుబాటులోకి తెస్తామన్నారు. వినూత్న ఆలోచనలతో నూతన ఒరవడి సృష్టించాలన్నారు. కవి చొప్ప దండి సుధాకర్ తదితరులు మాట్లాడారు. చిత్రలేఖనం, వ్యాసరచన, సుడోకో, జీకే ముగ్గుల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ సూపరింటెండెంట్ రాజేశ్వరి, న్యాయవాది మనోహర్, మామిడాల స్రవంతి, గంథ్రాలయ పాలకులు రాజు, దాసరి రాజు,శ్రీనివాస్, ముజఫర్, మల్లయ్య, సాయి, హరి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లను పూర్తి చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**బెజ్జంకి, నవంబరు 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బేగంపేట గ్రామం నుంచి బెజ్జంకి పోతారం గ్రామ శివారులో గల రాజీవ్ రహదారికి, బెజ్జంకి, గుండారం, కిష్టాపూర్ వరకు గుండారం పేరకబండ, చౌడారం, బెజ్జంకి, కల్లేపల్లి, రేపాక, బేగంపేట, వడ్లూర్, ఖాసీంపేట, వీరాపూర్ బేగంపేట దేవక్కపల్లి స్టేజి నుంచి వరుకోలు బ్రిడ్జి వరకు బేగంపేట గను కుల కొండాపూర్ వరకు అసంపూర్తిగా మిగిలిన రోడ్డు మార్గాలను వెంటనే పూర్తి చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ పార్టీ మండల అధ్యక్షులు పాకల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులను స్థానిక పోలీసులు అరెస్టుచేసి కోహెడ పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు కనగండ్ల తిరుపతి, లింగాల లక్ష్మణ్, దీటి రాజు, క్రావల మల్లేశం, బిగుల్ల మోహన్, శేఖర్‌బాబు,రాజిరెడ్డి పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం : ఎమ్మెల్యే


ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

**బెజ్జంకి, నవంబరు 20, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిర్మ ఇళ్ల పథకంలో పేదల సొంతింటి కల సాకారం అవుతుం దని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం వీరాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలలో ఆయన పాల్గొని ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విడతల వారిగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవు తుందన్నారు. నిర్మాణ దశలో ఉన్న లబ్దిదారులు త్వరగా పూర్తి చేసుకొని గృహ ప్రవేశం చేయాలన్నారు. గత ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని కేవలం పార్టీ నాయకులకే సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్దిదారులకు సిఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడివో ప్రవీణ్,ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, బైర సంతోష్, చెన్నారెడ్డి,శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఆర్ట్ పోటీలో గురుకుల విద్యార్థికి గోల్డ్‌మెడల్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త :** మండలంలోని జిల్లలగడ్డ సాంఘీక సంక్షేమ పాఠశాలలో 7వ తరగతి చుక్క విగ్నేష్ ఇటీవల ముంబైలో జరిగిన జాతీయ స్థాయి ఆర్ట్ కంపిటేషన్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలత తెలిపారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన విగ్నేష్‌ను గురువారం ఆమె ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని అభినందించిన వారిలో ఆర్ట్ టీచర్ దినేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.


విద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

# అధ్వానం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రోడ్డు

**-వర్షాలతో రోడ్డుపై ఏర్పడిన గుంతలు.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు**

**బిజెపి నేతలు మరమ్మతు చేసినా యధావిధిగా మారిన రోడ్డు**


ప్రమాదకరంగా మారిన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రోడ్డు

**గజ్వేల్, నవంబరు 20 (ప్రభాతవార్త):** ప్రతి రోజు వేల సంఖ్యలో వాహనాలు తిరిగే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ఏర్ప డిన గుంతలతో వాహనదారులు ప్రయాణించాలంటే జంకుతున్నారు. మూడు నెలల నుంచి పలు ప్రమా దాలు జరిగినా సంబంధిత ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ప్రజ్ఞా పూర్ నుండి గజ్వేల్‌కు వచ్చే రహదారిలో పార్థి వేశ్వరస్వామి ఆలయం కమాన్ నుండి మొదలు కొని గజ్వేల్‌లోని మున్సిఫ్ కోర్టు వరకు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో స్థానిక బిజెపి నాయకులు కమ్మరి శ్రీనివాస్, మనోహర్‌యాదవ్, వద్దేపల్లి ప్రసాద్ తదితరులు కలిసి సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో సమస్యను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. అయినా స్పందించకపోవడం తో మరోసారి కలెక్టర్‌ను కలిసి సమస్యను పరిష్క రించాలని కోరారు. అయినా అధికారుల్లో చలనం రాకపోవడంతో బిజెపి నాయకులు తమ సొంత ఖర్చులతో ఈనెల 7వ తేదీన గుంతలు ఏర్పడిన రోడ్డులో కంకర, డస్ట్, సిమెంట్‌తో మరమ్మతులు చేయించారు. సిమెంట్‌తో మరమ్మతులు చేయగా నీటిని పట్టకపోవడంతో నిత్యం వేలాది వాహనాలు అదే రోడ్డుపై రాకపోకలు సాగించడంతో రోడ్డుపై గుంతలు యధావిధిగా మారాయి. రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై డాంబర్‌తో మరమ్మతులు చేయించాలని ప్రయా ణీకులు కోరుతున్నారు.


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## మత్స్యకార దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు శ్రీనివాస్**

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త :** ముదిరాజులే మత్స్య కారులు, మత్స్యకారులే ముదిరాజులు అనే నినాదంతో 2014 నవంబరు 21న ముదిరాజ్ మహాసభ ఆవిర్భవించి నేటికి(శుక్రవారం)కి తెలంగాణ ముది రాజ్ మహాసభ 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సంఘం వార్షికోత్సవ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సంఘం హుస్నాబాద్ మండల అధ్యక్షులు పెన్నబోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాల్లో ముదిరాజ్‌లు ముదిరాజ్ జెండా ఎగురవేయాలని కోరుతూ హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో నియోజకవర్గ ఇన్‌చార్జి చొప్పరి శ్రీనివాస్‌ముదిరాజ్, నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు పెండ్యాల ఐలయ్యలతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ అధ్యక్షులు పొన్నం మల్లయ్య, అక్కన్నపేట సొసైటీ, మండల అధ్యక్షులు గంగాధర్ రాజయ్య, కాశబోయిన యాదగిరి, పొట్లపల్లి అధ్యక్షులు బోడ శంకర్, హుస్నాబాద్ కార్యదర్శి రాగుల శీను, కూరగాయల రవి, రాగుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన బావి..ఆందోళనలో ప్రజలు


ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన బావి

**అక్కన్నపేట, నవంబరు 20, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న పురాతన బావి, ఇటీవల వచ్చిన మొదా తుఫాన్ కారణంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలు పేరుకుని దుర్వాసన వెద జల్లుతోంది. ఎన్నిసార్లు సమాచారమిచ్చినా పట్టించుకునేవారు లేరని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇళ్లమధ్యలో ఉన్న ఈ బావి పక్కనే రోడ్డు ఉండడం తో చిన్నపిల్లలు, మూగజీవులు, వాహనదారులకు వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబందింత అధికారులు ఈ విషయంలో చొరవ తీసు కుని ప్రజలకు నష్టం జరగకుండా ఉండేందుకు బావి చుటూ గోడలు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇది ఇలాగే ఉంటే ప్రాణనష్టం జరిగే అవకాశముందని నివాసి తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బావి నిండి ఉండడం, అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో అందులో నుండి దుర్వాసన వెదజల్లుతుందని తద్వార వారు అనారోగ్యానికి కూడా గురౌతున్నామన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గాంధీనగర్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త :** మండలంలోని గాంధీనగర్ గ్రామంలో హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా గురువారం వాలంటీర్లు శ్రమదానం చేసి, మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే సీసీ రోడ్డు పక్కన పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లను తొలగించడంతో పాటు గుంతలను మట్టితో నింపి విద్యార్థులకు కలిగే ఇబ్బందులను తొలగించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి రణధీర్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛత అంటే ఆరోగ్యం అని, ప్రతి విద్యార్థి, ప్రతి గ్రామస్తుడు శుభ్రతలో తమ వంతు పాత్ర పోషించాలని అందుకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఎల్లప్పుడూ తోడుంటుందన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హుస్నాబాద్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనిత రెడ్డి పాల్గొని విద్యార్థులకు యోగ,ధ్యానం, ప్రాణాయామాలు లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. శరీరమే దేవాలయం అని యోగతో ఆరోగ్యం ప్రాప్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణా దేవి, ఎన్ఎస్ఎస్ చైర్మన్ సిహెచ్ గంగాధర్, అధ్యాపకుడు వెంకటేష్, విద్యార్థులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

**గజ్వేల్ టౌన్, నవంబరు 20 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని జిఎంఆర్ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరం అన్నారు. సరదా గురించి వాహనం నడిపి జీవితాలు కోల్పోవద్దన్నారు. మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థి దశ నుండి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. జరిమానాలు విధించడం మా అభిమతం కాదని, నిబంధనలు పాటించని వారికి మాత్రమే జరి మానాలు విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


క్రికెట్ జట్టు ఎంపికైన విద్యార్థులు

## ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టుకు విద్యార్థి ఎంపిక

**పటాన్‌చెరు, నవంబర్ 20, ప్రభాతవార్త :** ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 17 క్రికెట్ జట్టుకు పటాన్ చెరు పట్టణానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ క్రీడలలో భాగంగా అండర్ 17 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు బుధవారం సాయంత్రం మెదక్ పట్టణంలో నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఏపీఆర్ కాలనీకి చెందిన ప్రభాకర్‌రెడ్డి కుమా రుడు శ్రీజన్‌రెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భం గా శ్రీజన్ తండ్రి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్న లక్ష్యంతో వారికి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సాహిల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తున్నామని వారు తెలిపారు.

## ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు : సిఐ

**గజ్వేల్ టౌన్, నవంబరు 20 (ప్రభాతవార్త):** పట్టణంలోని ప్రధాన రోడ్ల లో, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలుచేసుకునే వ్యాపారస్తులకు గురువారం గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ పట్టణంలో వ్యాపారాలు చేసుకునే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు, మున్సిపల్ నిబంధనలు పాటించి వ్యాపారాలు చేసుకోవాలన్నారు. రోడ్డుపై వెళ్ళే వాహనాలకు, నడుచుకుంటూ వెళ్ళే ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించక పోతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాల గురించి, ఆర్థికంగా జరిగే నష్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నిరేష్, ఏఎస్ఐ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బల్దియా పరిధిలో ప్రతి వీధిలో దీపం వెలగాలి : ఎమ్మెల్యే


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, నవంబర్ 20, ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి పరిధిలోని పటాన్ చెరు, రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్ల పరిధిలో గల ప్రతి వీధి దీపం వెలగాల్సిందేనని, క్షేత్రస్థాయిలో నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్ చెరు క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి విద్యుత్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బల్దియా పరిధిలోని మూడు డివిజన్ల పరిధిలో విద్యుత్ స్తంభాలు, లైట్ల పనితీరుపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమీక్షించాలని సూచించారు. కాలనీలలో వీధి దీపాలు వెలగకపోవడం మూలంగా అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోతాయని అన్నారు. శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను బిగించాలని ఆదేశించారు. వీధి దీపాల అంశంలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ విభాగం డీఈ లక్ష్మీ ప్రియ, ఏఈ లికిత, తదితరులు పాల్గొన్నారు.

## పదివేల మందికి అన్న ప్రసాదం చేసే స్థాయికి ఎదగాలి

**మున్సిపల్ కమిషనర్ తాటి మల్లికార్జున్‌గౌడ్**

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త :** అన్నార్తుల ఆకలి తీర్చడానికి ఆవిర్భవించిన కాళీధ్యాని అమావాస్య అన్న సమారాధన ట్రస్టు ఇంతింతై వటుడింతై అన్నచందాన 150 మందితో ప్రారంభించిన అన్న దానం ప్రతి అమావాస్యకు పదివేల మందికి అన్నం పెట్టే స్థాయికి ఎద గాలని మున్సిపల్ కమిషనర్ తాటి మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. గురువారం బస్ స్టేషన్‌లో కాళీధ్యాని అమావాస్య అన్న సమారాధన ట్రస్ట్‌ను మున్సి పల్ కమిషనర్ మల్లికార్జున్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు అన్నదానంచేశారు. అనంతరం కాళిద్యాన్ని అమావాస్య అన్న సమారాధన ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ కందారపు రమేశాచార్యులు మాట్లాడుతూ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాళీ అమ్మ వారి ఉపాసకులని ఆమె ఉపాసనతో కాలజ్ఞానాన్ని రచించారని అమావాస్య రోజున అన్నపూర్ణ అమ్మవారుగా అమ్మవారు యావత్ సమాజాన్ని చల్లగా దీవించే క్రమంలో ఈ ట్రస్టుకు కాళీ ధ్యాని అమావాస్య అన్న సమారాధన ట్రస్ట్ గా నామకరణం చేశామని అన్నారు. ప్రతి అమావాస్యకు పబ్లిక్ ప్లేస్ లో పాఠశాలల్లో జన సమూహంలో అన్నదానం నిర్వహిస్తామని చైర్మన్ కందారపు రమేష్ ఆచార్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రయాణికులు జనగోని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న అశ్రిత్‌కుమార్

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకోవాలి

**మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్**

**సిద్దిపేట అర్బన్, నవంబరు 20, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల జి+1 విధానంలో చేపట్టాలనుకుంటే ముందుగానే గృహ నిర్మాణశాఖ అనుమతి తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మీఆనంద్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 37వ వార్డులలో గురువారం జి+1(గౌండ్+1) ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మొదటి అంతస్తు నిర్మా ణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. మొదటి 400-600 చదరపు అడుగుల వరకు మాత్రమే నిర్మించుకోవాలని షరతు ఉండేదని ప్రస్తుతం జి+1(గౌండ్+1) పద్ధతిలో ఇంటిని నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిం ద న్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఇంటిని ఆర్‌సిసి ఫ్రేంలోనే నిర్మించాలన్నారు. ఇంటి నిర్మాణంలో తప్పనిసరిగా వంట గది, మరుగుదొడ్డి ఉండాలన్న నిబంధనలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వంటిమామిడి ఎంఎంసి డైరెక్టర్‌కు సన్మానం


ఏఎంసి డైరెక్టర్ శంకర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

**మర్కుక్, నవంబరు 20 (ప్రభాతవార్త):** మర్కుక్ గ్రామానికి చెందిన గుండా శంకర్ ఇటీవల వంటిమామిడి మార్కెట్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం రంగనాయకస్వామి ఆలయంలో ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో డైరెక్టర్ గుండా శంకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘంనాయకులు మాట్లాడుతూ మా సంఘం నుండి ఏఎంసి డైరెక్టర్‌గా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందన్నారు. సం ఘం అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలిపారు. అంతకుముందు కార్తీక మాసం చివరి రోజు కావడంతో రంగనాయకస్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుడాల అశోక్, కోశాధికారి బల్లి శ్రీనివాస్, నాయ కులు తొడుపునూరి రమేష్, రావికంటి అభిలాష్, గంగిశెట్టి శేఖర్, బెల్దే సంతోష్, కొత్త శ్రీనివాస్, గుడాల నరేష్, బెల్దే శేఖర్, బల్లి నాగరాజు, అంజయ్య, రమేష్, నాగరాజు, నర్సింలు, రఘువీర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సేవ చేయడంలో ఆర్యవైశ్యులు ముందుంటారు

**-మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి**


మాట్లాడుతున్న రాజమౌళి

**గజ్వేల్ టౌన్, నవంబరు 20 (ప్రభాతవార్త):** పేదలకు సేవ చేయడంలో ఆర్యవైశ్యులు ముందుంటారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌సి.రాజమౌళి మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, పేదల కడుపు నింపడానికి ఆర్యవైశ్యులు ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమ న్నారు. మాజీ ఉపసర్పంచ్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ గజ్వేల్ పట్టణానికి చెందిన కొమరవెల్లి సుధాకర్ రమాదేవి దంపతులు వారి తండ్రి కొమరవెల్లి పెంటయ్య జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లింగం, మాజీ జెడ్‌పి టిసి రామచంద్రం, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, అత్తెల్లి లక్ష్మయ్య, కైలాస ప్రభాకర్, అయిత సత్యనారాయణ, కొమరవెల్లి సుధాకర్, కొత్త శ్యామ్‌సుందర్, దొంతుల సత్యనారాయణ, కాశీనాథ్, అత్తెల్లి రాజేశం, రుక్మయ్య, కైలాస ప్రశాంత్, ఉమేష్, కొమరవెల్లి శంకరయ్య, సిద్ది రామచంద్రం, గందె యాదగిరి, జిల్లా రాములు, శ్రీహరి, గందే శ్రీను, నేతి సంతోష్, సిద్దేశ్వర్, ఉప్పల చంద్రశేఖర్, గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై పొద్దుతిరుగుడు విత్తనాల అందజేత

**బెజ్జంకి, నవంబరు 20, ప్రభాతవార్త :** నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ అయిల్స్ పథకం కింద యాసంగిలో పొద్దుతిరుగుడు పంట సాగు చేయ డానికి ఆసక్తిగల రైతులకు వంత శాతం సబ్సీడిపై విత్తనాలు అందజేసినట్లు మండల వ్యవసాయ అధికారి బి.సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ నూనె గింజల పంట సాగు పెంపు లక్ష్యంగా నూనె దిగుమతి తగ్గించుకునే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అధిక దిగుబడినిచ్చే టిలాన్ టెకసన్-1 అనే రకాన్ని రైతులు సబ్సీడితో అందించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. 200 ఎకరాలకు అవసరమయ్యే విత్తనాలను కేటాయించారని తెలిపారు.

## చుక్కా రామయ్య ఆశయాలకనుగుణంగా ఇష్టా విద్యాసంస్థలు

**ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్ కోట**

**పటాన్‌చెరు, నవంబర్ 20, ప్రభాతవార్త :** ఐఐటి రామయ్య ఆశయాల కనుగుణంగా ఇష్టా విద్యాసంస్థలను తీర్చిదిద్దామని ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్ కోట అన్నారు. గురువారం ఇష్టా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా ఐఐటి చుక్కారామయ్య 100వ పుట్టినరోజు వేడుకలు ఇష్టా విద్యా సంస్థల ఫౌండర్, మాజీ ఎమ్మెల్సీ, అన్ని వర్గాల పేద విద్యార్థులకు ఐఐటీని పరిచయం చేసిన వ్యక్తి డాక్టర్ ఐఐటి చుక్కా రామయ్య జన్మదిన వేడుక లను ఇష్టా విద్యాసంస్థల ఆధ్వర్యంలో బీరంగూడ, పటేల్ గూడ, సంగా రెడ్డి, పటాన్ చెరు బ్రాంచ్ లలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్ కోట, ఇష్టా విద్యా సంస్థల డైరెక్టర్ వినోద్ కుమార్, ఇష్టా విద్యా సంస్థల అకాడమిక్ డీన్ ప్రేమ్ కుమార్ లు ఐఐటి చుక్కారామయ్య నివా సంలో రామయ్యను కలిసి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐఐటి చుక్కారామయ్య 100వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన జీవితంలో సాధించిన ఎన్నో గొప్ప విషయాలను గుర్తుచేస్తూ ఇష్టా విద్యాసంస్థలను ఆయన ఆశయాలకు తగ్గట్టుగా తీర్చి దిద్దామని తెలిపారు. ఈనాటి విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేని విద్యను అందించడమే ఆయన లక్ష్యం అని పేర్కొన్నారు. ఆయన ఆశయానికి తగ్గట్టుగా ఇష్టా విద్యా సంస్థల యాజమాన్యం ఎల్లప్పుడు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇష్టా విద్యాసంస్థల సంగారెడ్డి బ్రాంచ్ ప్రిన్సిపల్ డాక్టర్ రవి కిరణ్ రెడ్డి, పటేల్ గూడ బ్రాంచ్ ప్రిన్సిపల్ రజిత, వైస్ ప్రిన్సిపల్ విజయ్ భాస్కర్ రెడ్డి, బీరంగూడ బ్రాంచ్ ప్రిన్సిపల్ తులసి, వైస్ ప్రిన్సిపల్ పవన్ కుమార్, విజన్ స్కూల్ ప్రిన్సిపల్ ఇబ్రహీం, ఇష్టా విద్యా సంస్థల ఫిజికల్ డైరెక్టర్ లు రమేష్, వెంకట్ రెడ్డి, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తాయి

**ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి**

**సిద్దిపేట రూరల్, నవంబరు 20,ప్రభాతవార్త :** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల(డాక్టర్ అబ్దుల్ కలాం) ప్రాంగణంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, 53వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానికి ప్రద ర్శన 2025 రెండో రోజు గురువారం విజయ వంతంగా కొనసాగింది. వైజ్ఞానిక ప్రదర్శనను ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్, జిల్లా పర్యవేక్షణ అధికారి సోమిరెడ్డి సందర్శించారు. వైజ్ఞానిక ప్రద ర్శనను తిలకించిన ఆయన విద్యార్థులు ప్రదర్శిం చిన ప్రదర్శనల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే కాకుండా బాల మేధావులుగా ఎదగ డానికి దోహదపడుతాయన్నారు. రాష్ట్రంలోనే ఇన స్పైర్ నామినేషన్లలో జిల్లా అత్యధిక ప్రదర్శనలు ప్రదర్శించడానికి కృషి చేసిన డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డిఎస్ఓ కళ్లెపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. రెండో రోజు 50 పాఠ శాలల విద్యార్థులు 4815 మంది విద్యార్థులు సందర్శించి వైజ్ఞానిక అంశాల పట్ల వారి ఆసక్తిని వ్యక్తపరిచారు.

వ్యాసరచన, సెమినార్ ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ అంశంపై నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను చూపరులను అకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆస లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


వైజ్ఞానికి ప్రదర్శనలను తిలకిస్తున్న సోమిరెడ్డి



ప్రజాబాటలో పాల్గొన్న జోగిపేట ట్రాన్స్‌కో డిఇ శ్రీనివాస్

## ప్రమాదాల నివారణకే 'ప్రజాబాట'

### జోగిపేట డివిజన్ ట్రాన్స్‌కో డిఇ శ్రీనివాస్

**జోగిపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** విద్యుత్ ప్రమాదాల నియంత్రణకే ప్రజాబాట నిర్వహిస్తున్నామని జోగిపేట డివిజన్ ట్రాన్స్‌కో డిఇ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని అందోలులో పలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ తీగలు సరిచేయటం, ఏబి స్విచ్‌లు సరిగా ఉన్నాయో లేదో చెక్‌చేయటం, అలాగే ఏవైనా మొక్కలు, తీగలు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉంటే వాటిని తొలగించటంలాంటి పనులు చేపట్టారు. ఎక్కడైనా విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా ఉన్నా, మరమ్మతులు ఉన్నా ఆపనులు చేపడుతున్నట్లు డిఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. వారంలో మూడురోజులపాటు ప్రజాబాట కార్యక్రమం ద్వారా ఈ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం, గురువారం, శనివారం ఉదయం 8గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ పనులు చేపడతారని, అనంతరం రెగ్యులర్ డ్యూటీ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఇందులో లైన్‌మెన్ల నుంచి పైస్థాయి అధికారుల వరకు ఎవరి మండలాల్లో వారు పనులు చేపడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అందోలు ఏఇ శ్రీనివాస్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



జోనల్ కమిషనర్ పంకజ్‌కు వినతి పత్రం అందచేస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, నవంబరు 20, ప్రభాతవార్త:** భారతీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు అవసరమైన రూ. 4 కోట్ల నిధులను మంజూరు చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి గురువారం వినతిపత్రం అందజేశారు. గురువారం సింధుఆదర్శ్‌రెడ్డి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కర్ణన్‌కు 4 కోట్ల రూపాయల ప్రతిపాదనలు పంపగా స్పందించిన కర్ణన్ జోనల్ కమిషనర్‌కు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిన విషయం పాఠకులకు విధితమే. జిహెచ్ఎంసి కమిషనర్ సూచించిన విధంగా నిధులు మంజూరు చేస్తూ ప్రతిపాదనలను ప్రాసెస్‌చేస్తూ కమిషనర్ కార్యాలయానికి పంపి అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు కాగానే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడతామని కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి వివరించారు.

### కాకతీయనగర్ కాలనీలో బస్తీ దర్శన్



బస్తీ దర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, నవంబరు 20, ప్రభాతవార్త:** అభివృద్దే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో నిర్వహించిన బస్తీదర్శన్‌లో ఆమె అధికారులతో కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ మాట్లాడుతూ కాలనీలో నూతనంగా 3.20 కోట్ల హెచ్ఎండిఏ నిధులతో నిర్మిస్తున్న థీమ్ పార్క్ పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓపెన్ గ్యారేజ్ పాయింట్ నిర్మిస్తే ఎలా అని, గార్బేజ్ పాయింట్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. పార్క్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ పరిశీలించారు. పనులను పూర్తి చేయాలని, త్వరలో మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్‌తో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు.కార్యక్రమంలో అధికారులు, నాయకులు నరేంద్రబాబు, ప్రభాకర్‌రెడ్డి, రాములు, వెంకట్‌రావు,గోల శ్రీనివాస్, ధనసిరి ప్రకాష్, ఎన్ఎస్ రెడ్డి, మునీందర్, అంజద్, వీర్‌శెట్టి, గోవర్ధన్‌రెడ్డి, బ్రహ్మరాజు పాల్గొన్నారు.

### క్రీడలతోనే విద్యార్థుల్లో మానసికోల్లాసం

**-పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రాజయ్య**



చేర్యాల పాఠశాలలో వాలీబాల్ పోటీలు కొనసాగుతున్న దృశ్యం

**కంది, నవంబరు 20, ప్రభాతవార్త:** క్రీడలతోనే విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం నెలకొంటుందని ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య అన్నారు. మండలపరిధిలోని చేర్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంట్రా మురల్ ఆటల పోటీలు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జానర్ధ పర్యవేక్షణలో కబడ్డీ, వాలీబాల్, కోకో ఆటల పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీపడాలని సూచించారు. ఆటల పోటీలు పాఠశాల ఉపాధ్యాయులు సోమశేఖర్, రాజు, మీనాక్షి, చంద్రశేఖర్, మాణెమ్మ, యాదగిరి, నాగేంద్రం పర్యవేక్షణలో కొనసాగాయి.

### ఏడుపాయల హుండీ ఆదాయం రూ.29.లక్షల 92 వేలు

**పాపన్నపేట, నవంబరు 20, ప్రభాతవార్త :** ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి హుండీల ద్వారా రూ.29,92,712లు ఆదాయం ఆలయానికి సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపార్.గురువారం ఈవో చంద్రశేఖర్, ప్రత్యేకాధికారి సహాయ కమిషనర్ సులోచనల సమక్షంలో సిబ్బంది, సేవా సమితి సభ్యులు గోకుల్ షెడ్‌లో గురువారం హుండీని లెక్కించగా వెండి, బంగారం మినహా 101 రోజుల్లో ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, శ్యాం, బ్రహ్మచారీ ఉన్నారు. ఏడుపాయల ఔట్‌పోస్టు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

# రైతులు దీర్ఘకాలిక పంటల వైపు దృష్టి పెట్టాలి

### జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్



మాట్లాడుతున్న దేవకుమార్

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 20, ప్రభాతవార్త :** రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలంటే దీర్ఘకాలిక పంటల వైపు దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంపొందించే దిశగా గురువారం రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానవన మరియు సహకార శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు, ఇతర పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంటల నిర్వహణలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మరియు జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమశాఖ అధికారి ప్రతాప్‌సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మాట్లాడుతూ రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలంటే దీర్ఘకాలిక పంటల వైపు దృష్టి పెట్టాలని, అంతర పంటలను సాగుచేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, ఎరువులు, పురుగుమందులు అధిక మోతాదులో వాడటం వలన ఖర్చులు పెరగడమే కాకుండా నేల-నీటి కాలుష్యానికి దారి తీస్తుందని, పురుగుల రోగనిరోధకత పెరిగిపోయి రైతులు మరింత ఖరీదైన మందులు ఉపయోగించే పరిస్థితి వస్తుందని తెలిపారు. అందువల్ల వ్యవసాయ శాఖ సూచనల మేరకే ఎరువులు పురుగుమందులు వినియోగించాలని రైతులకు సూచించారు. జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చట్టం రూపొందించిందని, పండించిన పంటను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయడమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా కనీస ధర హామీ ఇస్తోందని, మండల స్థాయిలో సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయిల్ పామ్ ఒక దీర్ఘకాలిక పంట కాబట్టి 30 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం పొందవచ్చని, ఒక్క ఎకరాకు కేవలం 57 మొక్కలు మాత్రమే నాటితే సరిపోతుందని, మిగతా ఖాళీ ప్రదేశాల్లో అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం సాధ్యమవుతుందని రైతులకు వివరించారు. సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇంచార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ నారాయణ మాట్లాడుతూ అన్ని పంటలలో జింక్ సల్ఫేట్ వినియోగించాలని, చౌడు నేల సమస్య ఉన్న ప్రాంతాల్లో జిప్సం వాడాలని, ప్రతి మంగళవారం రైతు వేదికలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరవుతూ నూతన సాంకేతిక పద్ధతులు నేర్చుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, ప్రాథమిక సహకార సంఘం కార్య నిర్వాహణ అధికారి, సహకారబ్యాంకు అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

### విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, నవంబరు 20 ప్రభాతవార్త :** విద్యార్థులు శాస్త్రవేత్తలుగ్గా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మూడు రోజులుగా ఈతక్‌షీలా పాఠశాలలో జరిగిన 53వ సైన్సు ఫెయిర్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్సు ఫెయిర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి అబ్దుల్ కలామ్, విక్రమ్ సారాభాయ్‌ని ఆదర్శనంగా తీసుకోవాలని సూచించారు. గణిత విభాగంలో జిల్లా స్థాయిలోనేగాక రాష్ట్రా, జాతీయ స్థాయిలో రాణిస్తున్న ర్యాల మడుగు ఉపాధ్యాయిదు వినయ్‌సాగర్‌ని ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ చినుముల అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన బాండాగారంగా తయారు కావాలన్నారు. సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఇంత పెద్ద కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డిఎస్పీ వెంకట్‌రెడ్డి, సిఐ శ్రీనివాస్‌రెడ్డి, డీసీబీ సెక్రెటరి లింబాజి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్, జిల్లా సైన్సు అధికారి సిద్ధారెడ్డి, పాఠశాల కరెస్పాండెంట్ శరత్, ఆయా మండలాల విద్యాధికారులు, నిర్వాహకులు చంద్రశేఖర్ ఆచార్య, రాజయ్య, వినయ్‌భాస్కర్, మల్లన్న, నర్సింలు, ఉపాధ్యాయ సంఘాల, వ్యాఖ్యాత శిరోమణి గంగా కాశీనాథ్, నాయకులూ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజ్ఞాన కార్యక్రమంలో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, విద్యాధికారి, డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.

### సిఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**నారాయణఖేడ్, నవంబరు 20 ప్రభాతవార్త :** పట్టణంలోని జుక్కల్ శివారులోనీ కన్వెన్షన్ హాల్ వేదికగా గురువారం నారాయణఖేడ్, కంగ్టి, నిజాంపేట్, నగల్ గిద్ద, మనూర్, సిర్గాపూర్ మండలాలకు సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క పేదవాడికి ప్రతి ఒక్క పథకం అందే విధంగా మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ముదిరాజుల మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**నారాయణఖేడ్, నవంబరు 20 ప్రభాతవార్త :** పట్టణంలో ముదిరాజ్ మహాసభ 11 వార్షికోత్సవలు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నవంబర్ 21 రోజున నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ముదిరాజ్ జండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టాలని ఈరోజు నారాయణఖేడ్ పట్టణంలోని దుర్గాభవాని మాత ఆలయం దగ్గర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు నారాయణ, అడ్వకేట్ డి.నారాయణ సంగారెడ్డి జిల్లా నాయకులు, గుండు వెంకటరాములు అడ్వకేట్, అల్కారి సత్యనారాయణ, రాష్ట్ర ముదిరాజ్ నాయకులు, శ్రీశైలం ముదిరాజ్, నేతి రామచందర్ ముదిరాజ్, బుగడాల రవి ముదిరాజ్, పుటాల విట్టల్ ముదిరాజ్ కౌన్సిలర్, చామకూరి పాండు ముదిరాజ్,నర్సింలు ముదిరాజ్ సీసీ కెమెరా, బృందావన్ నరసింహులు ముదిరాజ్, సంతోష్ ముదిరాజ్, పుర్ర సాయిలు ముదిరాజ్, మైకోటి కేశయ్య ముదిరాజ్, పుండ్లీక్ ముదిరాజ్ మచ్చేందర్ ముదిరాజ్, బాలు ముదిరాజ్, అంబదాస్ ముదిరాజ్,అశోక్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, తదితరులు ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

### వీరభద్ర స్వామి సన్నిధిలో బ్రహ్మానంద సరస్వతి ప్రత్యేక పూజలు చండీ హోమం

**గుమ్మడిదల నవంబర్ 20 ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం వార్డులోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి దేవాలయాన్ని బదరి బదరి కాశ్రమా పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతి దర్శించుకున్నారు. వీరభద్ర స్వామి దేవాలయానికి జోష్ మట్ట ఉత్త రామయ్య పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రుడికి అభిషేకాలు అమ్మవారికి పూజలు, హోమం నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య,అర్చకులు ఆయనకు పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో 9 అంతస్తుల మహా రాజ గోపురం నిర్మాణనికి జోష్ మట్ట బదరికాశ్రమా పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతి పనులను పరిశీలించి నిర్మాణ పనులను సజ్జావుగా సాగాలని అనుగ్రహం ఇచ్చారు. ఆలయ మర్యాదలతో బ్రహ్మానంద సరస్వతికి సత్కా రాలు చేశారు. అలాగే కార్తిక అమావాస్య పురస్కరించుకొని గుమ్మడిదల మాజీ ఉపసర్పంచ్ మూడుచింతల నరేందర్ రెడ్డి, దంపతులు చండీ హోమం ప్రత్యేక పూజలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. భక్తులు కార్తిక దీపం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు.

### మల్లికార్జున ఆలయంలో కార్తీక దీపోత్సవం

**సదాశివపేట, నవంబరు 20 (ప్రభాతవార్త):** కార్తీక మాసం సందర్భంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున ఆలయంలో భక్తులు విశేష పూజలు జరిపారు. ప్రతి నెల అమావాస్య రోజున లింగంగుడైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కి పంచామృతలతో అభిషేకం చేయడం ఆనవైతిగా వస్తుంది. గురువారం కార్తీకమాసంలో చివరి అమావాస్య సందర్భంగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కనిగిరి అనురాధ శంకర్ గౌడ్ దంపతులు ఆ స్వామికి పంచామృతాలతో అభిషేకించారు. స్వామివారికి ఇష్టమైన భస్మంతో పూలతో అలంకరణ చేశారు. 198384 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల మిత్రబృందం పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామికి పంచామృతాలు గంగాజలంతో అభిషేకం చేశారు. ఏంపల్లి జగదీశ్వర్, సుధాకర్ భజన మండలి భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దేవాలయంలో ఉన్న మహిళలు కార్తీకదీపం వెలిగించి స్వామికి సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. శంకర్ గౌడ్ అన్నదాన కార్యక్రమం చేశారు.

### వేకువజాము ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి : ఎస్ఐ

**నారాయణఖేడ్, నవంబరు 20 ప్రభాతవార్త :** వేకువజామున సమయంలో పొగమంచు వ్యాపించి వుండటం వలన రహదారులలో వాహనాలు స్పష్టంగా కనపడకపోవటం వలన తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం వుంటుందని జాగ్రత్తగా ప్రయాణాలు సాగించాలని ఎస్సై శ్రీశైలం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పనిసరి అయితే తప్ప ఉదయం పూట ప్రయాణం చేయయొద్దని మీ వాహనం హెడ్ లైట్ వేసి వుంచి ప్రయాణం చేయాలని, వేగం తగ్గించి ముందున్న మరియు ఎదురుగా వస్తున్నటువంటి వాహనాలకు సురక్షిత దూరం పాటించాలని, టూ వీలర్ నడిపే వాళ్ళు గ్లౌసెస్ తప్పనిసరిగా ధరించాలి చేతులు చల్లబడితే వాహన నియంత్రణ తగ్గుతుందన్నారు. విజిబిలిటీ చాలా తక్కువగా ఉంటే, సురక్షిత ప్రదేశంలో ఆగి వేచి ఉండండని, గ్రామాలను దాటి వెళ్లేటప్పుడు, పాదాచారులు రోడ్డు దాటుతుంటారు కాబట్టి మరింత నెమ్మదిగా వెళ్లగలరని సూచించారు. ప్రజల భద్రతే మా లక్ష్యం అని, శీతాకాలంలో రోడ్లపై వాహనదారులు జాగ్రత్తలు పాటించి మీ గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుకోగలరని విజ్ఞప్తి చేశారు.

### గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

**నర్సాపూర్, నవంబరు 20, ప్రభాతవార్త :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని డాక్టర్ వివిఎస్ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుండి 20 వరకు కొనసాగాయి. గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా డాక్టర్ వీవీఎస్ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు ఎంతో విజ్ఞానం కలిగిస్తుంది అన్నారు ప్రతి విద్యార్థి పుస్తక పటనాన్ని అలవాటు చేసుకుంటే జీవితంలో ఉన్న స్థానాలకు తీసుకెళ్తుంది అన్నారు. డాక్టర్ వనిత మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తకాల విలువ తగ్గలేదన్నారు. అంతకుముందు ఈ విద్యార్థులకు బుక్ హంట్, క్విజ్ ఛాలెంజ్, ఫోటో కాంటెస్ట్, డ్యూటీ యువర్ లైబ్రరీ, ఎల్లో ఫ్యూషన్ వంటి వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, లైబ్రరీ యన్ ఎం రజిని, ఇంచార్జ్ కే ఎల్ శ్రావణి,భవాని, జాహ్నవి, కే సాయి కృపా రాజ్, పూజిత, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

**గుమ్మడిదల నవంబరు 20 ప్రభాతవార్త**

మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష్యం చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కమిషనర్ మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. వచ్చే రూ. 16,600 వేతనం సరిపోవడం లేదన్నారు. మున్సిపల్ ఏర్పడి 11 నెలలు పూర్తవుతున్నా నేటి వరకు యూనిఫామ్‌లు చెల్లించలేదని చెప్పారు. పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించిన ఏ ఒక్క కార్మికునికి ఉపయోగపడడం లేదని అన్నారు. విధి నిర్వహణలో కార్మికునికి కాలు విరిగితే ఏ ఒక్క అధికారి నేటివరకు పట్టించుకోలేదన్నారు. అందుకోసం మున్సిపల్ అధికారులు ప్రతి కార్మికునికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రామపంచాయతీ ఉన్న కాలం నుండి మున్సిపల్ వరకు విధులు నిర్వహిస్తున్నారని, అందుకోసం అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్బులు, నూనెలు బెల్లం, ప్రతి సంవత్సరం ఇచ్చే రెయిన్‌కోట్స్ ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష్యం వహిస్తుందని బడ్జెట్లో తగిన నిధులు కేటాయించకపోవడంతో, అనేక సమస్యలు పెండింగ్లోనే ఉంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రవీందర్, గుమ్మడిదల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆనంద్‌రెడ్డి, కోశాధికారి వీరేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌస్, ప్రధాన కార్యదర్శి మహేష్, సలహాదారులు రమేష్, లింగమ్మ, కిషన్ అమ్మ, కవిత, చంద్రయ్య పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

### రవాణ రంగ కార్మికులకు వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలి

**సిఐటియు జిల్లా కార్యదర్శి జి.సాయిలు**

**జోగిపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి. సాయిలు డిమాండ్ చేశారు. గురువారం జోగిపేటలోని ఆటో అడ్డావద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా వచ్చే సౌకర్యాలని రవాణా రంగ కార్మికులకు అందించాలని కోరారు. రవాణ రంగా కార్మికులకు నష్టం చేసే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రవాణరంగ కార్మికులకు ఇస్తానన్న రూ. 12 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ చలాన్ల పేరుతో డ్రైవర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. చలాన్ల పేరిట దందా చేస్తున్న పోలీస్ అధికారులపైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో అడ్డాల వద్ద కార్మికులకు తాగునీటి సౌకర్యం, విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు కల్పించాలని కోరారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మెదక్ జిల్లాలో సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభలు నిర్వహించటం జరుగుతుందని, ఇందులో రవాణారంగ కార్మికుల సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారానికి భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి.విద్యాసాగర్, నాయకులు వెంకటేశం, పాండు, అశోక్ పాల్గొన్నారు.

### ఘనంగా బస్వ మాణయ్య జయంతి వేడుకలు

**జోగిపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధులు, అందోలు మొదటి శాసనసభ్యులు, ఆర్యసమాజ వ్యవస్థాపకులు అయిన జోగిపేటకు చెందిన బస్వ మాణయ్య 102వ జయంతిని గురువవారం జోగిపేటలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జోగిపేటకు చెందిన పురప్రముఖులు పాల్గొని బస్వ మాణయ్య చేసిన పోరాటాన్ని, ఆయన సేవలను స్మరించుకున్నారు. కాగా ఇదే రోజు ప్రపంచ బాలల దినోత్సవం కావటంతో పలువురు పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. జోగిపేట పట్టణ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

### నిశ్శబ్ద పోలీసులు సిసి కెమెరాలు : ఎస్ఐ

**న్యాల్‌కల్, నవంబరు 20, ప్రభాతవార్త:** హద్నూర్ పోలీసు ఠాణా పరిధిలోని ఆయా గ్రామాల్లో నేరాల నివారణ, ప్రజాభద్రత బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాల్సిన అవసరం ఉందని ఎస్ఐ దోమ సుజిత్ కోరారు. గురువారం ఎస్ఐ సుజిత్ ఒక ప్రకటన విడుదల చేశారు. సీసీ కెమెరాలు నిశబ్ద పోలీసులుగా రౌండ్ ద క్లాక్‌గా పనిచేస్తాయన్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్లలో, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు అదుపులో ఉంటాయని, ప్రజలకు భద్రత బలోపేతం అవుతుందన్నారు. నేరాలు చోటు చేసుకుంటే నేర విచారణలో సిసి కెమెరాల పుటేజీలు ఆధారాలుగా (సాక్ష్యాలుగా) ఉంటాయన్నారు. రోడ్డు ప్రమాదాలను గుర్తించడం సునాయాసం అవుతుందన్నారు. ప్రతి ఇంటికి సిసి కెమెరాతో ప్రతి వీధికి భద్రత కవచంగా ఉంటుందని, అందుకు సిసి కెమెరాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని మండల ప్రజలు ఎస్ఐ దోమ సుజిత్ సూచించారు.

### అమ్మవారి సేవలో ఎఐసిసి కోఆర్డినేటర్

**పాపన్నపేట, నవంబరు 20, ప్రభాతవార్త :** మార్గశిర అమావాస్యను పురస్కరించుకుని అల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి గురువారం ఏడుపాయల అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్ ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చందన, ప్రశాంత్‌రెడ్డి, నాగరాజు, భరత్‌కుమార్, బోరింగ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా క్రికెట్‌లో మెరిసిన మంజీర విద్యాలయ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న మంజీరా విద్యాలయం ఉపాధ్యాయులు

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 20, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన మంజీర విద్యాలయం విద్యార్థులు క్రీడారంగంలో మరోసారి ప్రతిభ చాటారు. ఎస్‌జిఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-17 క్రికెట్ పోటీల్లో పాఠశాలకు చెందిన పి. అభివరుణ్, డి.వినయ్‌లు అద్భుత ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితోపాటు వి.కార్తీక్ స్టాండ్‌బై క్రీడాకారుడిగా ఎంపిక కావడం పాఠశాలకు గౌరవకారణంగా నిలిచింది. ఎంపికైన విద్యార్థులు ఈ నెల చివరి వారంలో జడ్చర్లలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి. సురేష్ కుమార్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, వాసవి ఉపాధ్యాయ బృందంతో పాటు పీఈటీలు అనిల్,శ్రీశైలం విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ ఇదే ప్రతిభను ప్రదర్శించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మంజీర విద్యాలయం విద్యార్థుల ఈ విజయాలతో పాఠశాల వాతావరణం ఆనందభరితంగా మారింది.

### నేడు వాలీబాల్ అండర్ 18 క్రీడాకారుల ఎంపిక

**గుమ్మడిదల, నవంబరు 20 ప్రభాతవార్త:** తెలంగాణ 8వ అంతర్ రాష్ట్ర జిల్లాల వాలీబాల్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అండర్ 18 సం బాలుర బాలికల ఎంపికలు శుక్రవారం 21న చేగుంట ఎంపీడీవో కార్యాలయ క్రీడామైదానంలో ఉమ్మడి మెజిల్లా ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ప్రధాన కార్యదర్శి ఏ కృష్ణ తెలిపారు. క్రీడలపై ఆసక్తికలిగిన క్రీడాకారులు జనవరి 21, 1008 తర్వాత జన్మించినవారు అర్హులు. తమ జన్మ ధృవ పత్రాలు ఆధార్ ఒరిజినల్స్ తో పాటు ఒక సెట్టు జిరాక్స్‌తో హాజరు కావలసిందిగా ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతి, వెంకటేశ్వర్లు, పాల సాయిరాం, ప్రధాన కార్యదర్శులు రవీందర్, కృష్ణ, రవీందర్‌రెడ్డి సూచించారు.

### భక్తులతో కిక్కిరిసిన కేతకి ఆలయం

**ఝరాసంగం, నవంబరు 20, ప్రభాతవార్త:** కార్తీక అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకుని గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయం భక్తులతో, ప్రముఖులతో కళకళలాడింది. గురువారం ఉదయం తెల్లవారు జామున 4 గంటల నుంచి భక్తులు దర్శనం చేసుకోవడం ప్రారంభించారు. ఆలయానికి ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని ఆలయ ఆవరనలోని అమృతగుండంలో పుణ్యస్నానాలు, పాద ప్రక్షాళన చేసుకుని దైవాన్ని దర్శించుకున్నారు.

**ఆలయాన్ని దర్శించుకున్న మాజీ డిజిపి...**

కేతకి సంగమేశ్వర ఆలయానికి మాజీ డిజిపి దినేష్‌రెడికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా మాజీ డిజిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని చండి లింగం వద్ద అదనపు ఎస్పీ రఘునందన్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేకున్న ప్రముఖులను ఆలయ ఇఓ శివరుద్రప్ప, ఆలయ కమిటి చైర్మన్, ధర్మకర్తలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ జక్కుల హనుమంతు, పోలీసు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### కొమురవెల్లి మల్లన్న కళ్యాణం.. ముమ్మరంగా ట్రాఫిక్ ఏర్పాట్లు

**కొమురవెల్లి, నవంబరు 20, ప్రభాతవార్త :** శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ముందస్తు ట్రాఫిక్ ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. రెండేళ్ల తర్వాత సమ్మక్క-సారక్క జాతర నిర్వహణ జరుగుతుండడంతో కొమురవెల్లి ప్రాంతంలో ఈ ఏడు భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు కొమురవెల్లి పరిసర ప్రాంతాలను సందర్శించి ట్రాఫిక్ సంబంధించిన కీలక పాయింట్లు, రద్దీ ప్రాంతాలు, వన్‌వే అవసరాలు, డైవర్షన్ ప్లాన్‌లు పార్కింగ్ స్థలాలను పరిశీలించి గుర్తించారు. భక్తుల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవసరమైన అదనపు బారికేడింగ్, చెక్‌పోస్టుల ఏర్పాటు,పార్కింగ్ నిర్వహణ వంటి అంశాలను అధికారులు సమీక్షించారు. ట్రాఫిక్ పాయింట్లు చెరువు టి-జంక్షన్, గోశాల జంక్షన్, శ్రీ హోటల్ చెక్‌పోస్టు, బస్‌స్టాండు చెక్‌పోస్టు, పోలీసు విగ్రహం, బతుకమ్మ వై జంక్షన్‌లను గుర్తించారు. అలాగే పార్కింగ్ స్థలాల కోసం శ్రీ హోటల్, కూర్మ సత్రం, బస్‌స్టాండు, బతుకమ్మబండ,పిహెచ్‌సి, తోట బావిలను గుర్తించారు. కార్యక్రమంలో గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, ఎస్ఐ నీరేష్ తదితరులు ఉన్నారు.